క్లుప్తంగా

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్కలు నాటుతున్న పీఆర్ డీఈ సత్యంనాయుడు

నరసన్నపేట: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పంచాయతీ రాజ్ డీఈ సత్యంనాయుడు పిలుపునిచ్చారు. ఈ నెల 15న ఇంజినీర్స్ డే సందర్భంగా గడిచిన రెండు రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా మంగళవారం పీఆర్ కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ప్రతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఒక్కో మొక్కను నాటి దానిని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ సిబ్బంది అచ్చుతరావు, మండలంలో ఉన్న ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చిన్నారుల సాయం



చిన్నారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

పొందూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం స్థానిక భాష్యం పాఠశాల విద్యార్థులు తమ, తమ గ్రామాల్లో విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని మంగళవారం పాఠశాల ప్రిన్సిపాల్ టి.సుబ్రహ్మణ్యంకు అందజేశారు. 5వ తరగతి విద్యార్థిని పి.ఎస్.ఎస్ లోక్షిత రూ.10,010, 8వ తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రూ.6,320, నాల్గో తరగతి విద్యార్థిని కోమలి రూ.6,000 విరాళాల రూపంలో సేకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

భారీ వర్షాలకు కూలిన ఇళ్లు



కడుము గ్రామంలో కూలిన పూరిల్లు గోడ

కొత్తూరు: తుఫాన్ కారణంగా కొత్తూరు మండలం కడుము, కడుము కాలనీ లలో రెండు పూరిళ్లు కూలిపోయినట్లు వీఆర్ఓ రాజగోపాలరావు తెలిపారు. కడుము కాలనీలో గువ్వాడ జయమ్మకు చెందిన పూరిల్లు కూలిపోయింది. కడుము గ్రామానికి చెందిన కంబాల భాగ్యలక్ష్మికి చెందిన పూరింటి గోడ కూలిపోయినట్లు వీఆర్ఓ తెలిపారు. కూలిపోయిన ఇంటిని ఆర్ఐ లక్షణరావు, వీఆర్వోలు సందర్శించి నష్టాన్ని అంచనా వేసి తహసీల్దార్‌కి నివేదిక అందజేశారు.

కాలువ ఇలా.. సాగునీరు ఎలా?



పిచ్చి మొక్కలతో నిండిన కాలువ

సారవకోట: మండలంలోని వంశధార ఎడమ కాలువ నుంచి అవలింగి పెద్దచెరువుకు వెళ్లే పిల్ల కాలువ పిచ్చి మొక్కలతో నిండి పోయింది. కాలువ నుంచి చెరువులోకి నీరు పూర్తిస్థాయిలో వెళ్లడం లేదు. ఉపాధి హామీ పనులతో ఈ కాలువలో పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉన్నా.. సంబంధిత అధికారులు, సిబ్బంది చొరవ తీసుకోలేదు. ప్రస్తుతం కాలువ పిచ్చి మొక్కలతో పూర్తిగా నిండి పోయింది. సంబంధిత వంశధార అధికారులు మండలంలో కన్పించే దాఖలాలు లేవు.

గణపతికి 108 రకాల నైవేద్యం



హిరమండలం: మండల కేంద్రంలోని గిరిజాల వీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం యువకులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 రకాల పిండి వంటలను నైవేద్యంగా నివేదించారు. గణపతి ప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు.



కొత్తూరు: నివగాం బ్రిడ్జి వద్ద వంశధార నది వరదను పరిశీలిస్తున్న ఆర్డీఓ సుదర్శన దొర



బూర్జ: నారాయణపురం ఆనకట్ట వద్ద నాగావళి నదిని పరిశీలిస్తున్న అధికారులు



హిరమండలం: జిల్లోడిపేట వద్ద మహేంద్రతనయ నదిని పరిశీలిస్తున్న అధికారులు

వర్షం తగ్గింది.. నష్టం మిగిలింది

- నదులు, పంట పొలాల పరిశీలన
- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు



మెళియాపుట్టి: మహేంద్రతనయలో ప్రవహిస్తున్న వరదనీరు



పొందూరు: మొదలవలస వద్ద వరద నీటిలో ఉన్న వరి పంట

కొత్తూరు: వంశధార నదిలో వరద ప్రవాహం పెరిగినందున రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ఆర్డీవో సుదర్శన దొర ఆదేశించారు. మండలంలోని నివగాం బ్రిడ్జి వద్ద మంగళవారం వంశధార నది వరదను ఆర్డీఓ పరిశీలించారు. సాయంత్రానికి నదిలో వరద పెరగడంతో రాత్రి ఏ సమయంలో అయినా నదికి వరద మరింత పెరిగే అవకాశం ఉందని, నదీతీర ప్రాంత వీఆర్వోలు, ఆర్ఐలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు అధికారులు తెలియజేయాలని తహసీల్దార్ పాపారావుకు ఆదేశించారు. డీటీ సత్యనారాయణ, ఆర్ఐలు లక్ష్మణరావు, గిరిష్ కుమార్ పట్నాయక్, సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నరసన్నపేట: అధిక వర్షాలు నేపథ్యంలో నదీతీర గ్రామాలతోపాటు పొలాలు ముంపునకు గురైన గ్రామాలు, తంపర భూములను ప్రత్యేకాధికారి అనురాధ, తహసీల్దార్ సత్యనారాయణ, అధికారులు మంగళవారం పరిశీలించారు. వరద ఉధృతి పెరగవచ్చని అందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సత్యనారాయణ అన్నారు. పోలాకి మండలంలో డోల, కొల్లివలస, అంపలాం, గోవిందపురం గ్రామాల్లో ప్రత్యేకాధికారి వెంకట్రామమన్, తహసీల్దార్ సురేష్‌కుమార్ పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

బూర్జ: అల్పపీడన ప్రభావంతో గత మూడు రోజులుగా పడిన వర్షాలకు నాగావళి నదిలో వరద నీరు ఎక్కువగా వచ్చినప్పటికీ మంగళవారం తగ్గుముఖం పట్టింది. మండలంలోని నారాయణపురం ఆనకట్టవద్ద నాగావళిని తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, అధికారులు పరిశీలించారు. తోటపల్లి వద్ద గేటులు ఎత్తివేయడంతో నాగావళి నదిలో వరద పెరిగే అవకాశం ఉన్నందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు లోతట్టు గ్రామాల ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మండల స్పెషల్ ఆఫీసర్ విజయ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ యు.శ్రీనివాసరావు, డీటీ బి.సంతోష్‌కుమార్, ఈఓపీఆర్డీ పి.విజయలక్ష్మి, పలుశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వంశధార నదిలో వరదనీరు క్రమంగా పెరుగుతోంది. తీర ప్రాంతాల వాసులను అధికారులు అప్రమత్తం చేశారు.



నరసన్నపేట: మడపాంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ప్రత్యేకాధికారి అనురాధ

పొందూరు: అల్పపీడనంతో కురిసిన భారీ వర్షాలకు రెల్లిగెడ్డ ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని 1570 ఎకరాలు వరి పంట ముంపు బారిన పడింది. రెల్లిగెడ్డ ప్రవాహం తగ్గినప్పటికీ వరద నీటిలో వరి పొలాలు ఉన్నాయి. వరి పంట కుళ్లిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోరింట, గోకర్నపల్లి, తుంగపేట, పెనుబర్తి, లైదాం, తాడివలస, మొదలవలస, బొడ్డేపల్లి తదితర గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి బెండి బాబ్జి, తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు.

ఎల్.ఎన్.పేట: మండలంలోని వంశధార నదీతీర గ్రామాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్ సూచించారు. వంశధార నదీతీర గ్రామాలైన లక్ష్మీనర్సుపేట, దబ్బపాడు, వాడవలస, మిరియాపల్లి, బసవరాజుపేట తదితర గ్రామాల్లో పర్యటించారు. వరదనీటి ప్రవాహాన్ని పరిశలించారు. ఒడిశాలోని నదీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నదిలో వదరనీటి ప్రవాహం పెరుగుతుందన్నారు. ఎంపీడీఓ కాశీప్రసాద్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: ఒడిశాలో వర్షాలు భారీగా పడటంతో మండల కేంద్రంలో మహేంద్రతనయ నదికి మంగళవారం వరద పోటెత్తింది. నదిలో స్నానాలకు ఎవరూ వెళ్లొద్దని అధికారులు తెలియజేశారు. నదికి ఆనుకుని ఉన్న రట్టిణి, నడసంద్ర గ్రామాల ప్రజలకు తహసీల్దార్ హనుమంతరావు అప్రమత్తం చేశారు.



నరసన్నపేట: వెంకటాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ




ఎల్.ఎన్.పేట: వంశధార నదిలో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కిరణ్‌కుమార్

హిరమండలం: వంశధార గొట్టాబ్యారేజీలో పెరిగిన వరదనీటి ప్రవాహంతో నదితీర గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.రామ్మోహన్, తహసీల్దార్ బి.వెంకటరమణ, ఎంపీడీఓ బి.శైలజ అన్నారు. మండలంలోని నదీతీర గ్రామాలైన జిల్లోడిపేట, భగీరథిపురం, పిండ్రువాడ, అంబావల్లి, అక్కరాపల్లి, రెల్లివలస గ్రామాల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. వీఆర్వోలు పాల్గొన్నారు.

కాజ్‌వేపై పారుతున్న మహేంద్ర తనయ

పాతపట్నం: మహేంద్ర తనయ పొంగుతోంది. పాతపట్నం నీలకంఠేశ్వర ఆలయం వద్ద ఉన్న కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి మంగళవారం సాయంత్రం రెండు అడుగుల నీరు పారింది. నదిలో నీరు పెగడంతో కాపుగోపాలపురం, హరిజన గోపాలపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ రెండు గ్రామాలకు చెందిన ప్రజలు, విద్యార్థులు ప్రతి రోజు పాతపట్నంకు రాకపోకలు చేస్తుంటారు. మూడు రోజులుగా కాజ్‌వే బ్రిడ్జిపై నుంచి నీరు పారడంతో రెండు గ్రామాలకు చెందిన ప్రజలకు ఇబ్బందులు పడ్డారు.



వంశధారలో పెరిగిన నీటి ముట్టం



పాతపట్నం: మహేంద్రతనయ నది కాజ్‌వే పైనుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ఇది పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే..

- ముందస్తు జాగ్రత్తల్లేక... వరదల్లో విజయవాడను ముంచేశారు
- ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత ప్రజలకు ఇవ్వలేదు
- చంద్రబాబు పాలనంటే వరదలు, కరువులే..
- పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: విజయవాడను ముంచెత్తిన వరదల్లో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి అక్కడి ప్రజలను వరదల్లో ముంచేసిందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. విజయవాడ వరదల్లో ప్రజలను ముంచేసిన చంద్రబాబు వారికి సహాయం అందిస్తున్నామని అక్కడక్కడ తిరిగి ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా బుడమేరుకు వరదనీరు పెరుగుతోందని, తీర ప్రాంతానికి వరద భయం ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చాయన్నారు. అధికారులు ఇచ్చిన సూచనలను ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు ఉంటున్న ఇంటిని కాపాడేందుకు బుడమేరు గేట్లు ఎత్తివేసి వరద నీటితో విజయవాడను ముంచేలా చేశారని ఆరోపించారు. వరదనీటిలో వారం రోజులకు పైగా ప్రజలు తాగునీరు, ఆహారానికి ఇబ్బంది పడుతుంటే వారిని పట్టించుకోకుండా తన అనుకూల మీడియాలో ప్రచారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటోలకు ఫోజులిస్తున్నారన్నారు. సినీ నటులు, హీరోలు, ఇతర సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, మరికొందరు దాతలు కోట్లాది రూపాయలు విరాళాలు ఇస్తున్నారన్నారు. దాతలిచ్చే డబ్బులతో వరద బాధితులకు ఆదుకోవటంలోనూ ఈ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. దాతలు ఇచ్చే విరాళాలు వరద బాధితులకు సక్రమంగా చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీనియర్ నాయకుడునని, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేశానని చెప్పుకునే చంద్రబాబు వరదలు వచ్చినప్పుడు బాధితులను ఆదుకోవటంలో ఎందుకు నిర్లక్ష్యం చూపుతున్నారని ప్రశ్నించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కుర్చీ ఎక్కితే రాష్ట్రానికి వరదలు, కరువు వెంటాడుతూనే ఉంటాయన్నారు. గతంలోను హుద్‌హుద్, తిత్లీ తుఫాన్, వర్షాల్లేక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఎన్నో జరిగాయని గుర్తుచేశారు. అప్పట్లో కూడా ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత బాధితులను ఆదుకోవటానికి ఇవ్వలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కరోనా మహమ్మారిని వలంటీర్ వ్యవస్థతో ఎదుర్కొన్నారని వివరించారు. ప్రపంచమే భయపడిన కరోనా మహమ్మారి సమయంలో ఎలాంటి విరాళాలు లేకుండానే అన్ని వర్గాల వారిని ఆదుకున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలోనే రహదారి మంజూరు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే మండలంలోని అక్కరాపల్లి పంచాయతీ అంతకాపల్లి నుంచి కూర్మ గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి గతేడాది మార్చిలోనే రూ.కోటి ఉపాధి హామీ నిధులు అప్పటి ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంజూరు చేయించారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ, ఏపీ సురేష్ అన్నారు. మంగళవారం మండలంలోని కిట్టలపాడు గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. కూర్మ గ్రామంలో రాధాకృష్ణ ఇస్కాన్ మందిరం ఉండటంతో మన రాష్ట్రంతోపాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటున్నారన్నారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో గత ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రాంతం టూరిజంగా అభివృద్ధి చెందుతుందని అంతకాపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఎన్నికల కోడ్ రావడంతో పనులు జరగలేదన్నారు. టీడీపీ నాయకులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం రోడ్డు, నిధులు మంజూరు చేసినట్లుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. కూర్మ గ్రామం నుంచి అక్కరాపల్లి వరకు బీటీ రోడ్డును మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వి.చిన్నారావు, లుకలాపు ప్రసాద్, లుకలాపు శ్రీనివాసరావు, యు.కృష్ణారావు, ఎం.చిన్నయ్య, మీసాల రామారావు, నడిమింటి కృష్ణారావు, వి.బాలరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

ఎల్.ఎన్.పేట: వంశధార నిర్వాసితులు ఉంటున్న పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.కిరణ్‌కుమార్‌కు తులగాం పునరావాస కాలనీకి చెందిన గండివలస ప్రశాంత్‌కుమార్, జి.కృష్ణారావుతోపాటు పలువురు నిర్వాసితులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన కిరణ్‌కుమార్‌ను కలిసి సమస్యలు వివరించారు. మండల కేంద్రానికి సమీపంలో ఉన్న కోవిలాం కాలనీకి ఏగువ వైపున తులగాం గ్రామానికి చెందిన సుమారు వంద కుటుంబాలు పునరావాస కాలనీ ఏర్పాటు చేసుకున్నాయని తెలిపారు. కాలనీలో రోడ్లు, పిన్నంనాయుడు చెరువు నుంచి వచ్చే సాగునీటి కాలువ దాటి వెళ్లేందుకు వీలుగా వంతెన, చెరువు గట్టువైపు రక్షణ గోడ నిర్మించాలని కోరారు. ఈ సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి తగిన న్యాయం చేస్తానని ప్రత్యేక అధికారి భరోసా ఇచ్చారు. ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



సూర్యనారాయణను సన్మానిస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

పాతపట్నం: ఉపాధ్యాయులు కష్టపడి పనిచేసి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని ఎంపీడీఓ, ఎంఈఓలు జయంత్ ప్రసాద్, శ్రీధర్ అన్నారు. మండలంలోని లాబర ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న పుల్లేటి సూర్యనారాయణకు సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో పరిధిలో ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు రావడంతో ఆయనను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-2 సి.హెచ్.తిరుమలరావు, హెచ్‌ఎంలు కుమారస్వామి, సింహాచలం, వల్లభరావు, రామ్మూర్తి, గౌరేష్, రాజగోపాల్, విశ్వనాథం, వైకుంఠరావు పాల్గొన్నారు. పాతపట్నం మోడల్ స్కూల్‌లో సైన్స్ ఉపాధ్యాయుడు పనిచేస్తున్న బల్లెడ అప్పలరాజుకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడంతో ఆయనను ఆ పాఠశాలలో హెచ్‌ఎం రత్నకుమారి ఆధ్వర్యంలో సత్కరించారు.

యూనిఫాం వితరణ



విద్యార్థులకు యూనిఫాం అందజేస్తున్న దాతలు

సరుబుజ్జిలి: రొట్టవలస హైస్కూల్ ప్లస్ మహిళా జూనియర్ కళాశాల బాలికలకు గ్రామానికి చెందిన తాడేల రమణ, తాడేల రాజారావు తమ సొంత నిధులు వెచ్చించి 35 మందికి 2 జతల యూనిఫాం మంగళవారం పంపిణీ చేశారు. విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కత్తిరి రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైద్యుల నిరసన



ఎల్.ఎన్.పేట: డాక్టర్ లక్ష్మీదీప్, ప్రభుత్వ ఆస్పత్రి, తురకపేట



హిరమండలం: నల్ల బ్యాడ్జీ ధరించి విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారి సాయిగీత

హిరమండలం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (ఏపీపీహెచ్‌సీడీఏ) వైద్యులు జీఓ నంబర్ 85కు వ్యతిరేకంగా రాష్ట్ర హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ పిలుపుమేరకు పీహెచ్‌సీ వైద్యులందరూ మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వర్తిస్తున్నట్లు హిరమండలం, చొర్లంగి పీహెచ్‌సీ వైద్యులు సి.హెచ్.సాయిగీత, ఫారుహుక్ హుస్సేన్, యశ్వంత్, సంతోష్ తెలిపారు. జీఓ 85 ద్వారా తమ మూడేళ్ల సరీ్వసు పోతుందన్నారు. ఇలా జీఓ మార్చడం అన్యాయమన్నారు. కోవిడ్ సమయంలో తమ జీవితాలను ప్రమాదంలో పెట్టి సేవలు అందించినప్పటికీ.. ఇప్పుడు జీఓ 85 ద్వారా పీజీ అవకాశాలు తగ్గడం అన్యాయమన్నారు. తమ వృత్తి ప్రగతికి తీవ్రనష్టం కలుగుతుందన్నారు. గత రెండు నెలలుగా జీఓ రద్దు చేయమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు కోరుతున్నామన్నారు. వారి నుంచి ఎటువంటి సమాధానం రాలేదన్నారు. ఏపీ పీహెచ్‌సీడీఏ అసోసియేషన్ పిలుపుమేరకు దశలవారీగా ఆందోళన చేపడతున్నట్లు తెలిపారు.

దశలవారీ ఆందోళన తప్పదు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే డాక్టర్లు పీజీ చదువుకునేందుకు ఆటంకం కలిగేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోవాలని లక్ష్మీనర్సుపేట, తురకపేట ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్లు ఎస్.సునీత, ఎ.లక్ష్మీదీప్‌లు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం నుంచి ఆందోళనలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నల్ల బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరు అయ్యారు. ప్రభుత్వ తీసుకువచ్చిన జీఓ 85కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టామన్నారు. ఈనెల 16వ తేదీ వరకు ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతాయని, అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు.

నేడు మండల సమావేశం

పాతపట్నం: ఈ నెల 11వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దోర సావిత్రమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

సారవకోటలో రేపు

సారవకోట: ఈ నెల 12 మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలిత శుక్రవారం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించామని, కొన్ని కారణాల వల్ల గురువారం నిర్వహిస్తున్నామన్నారు. మండల స్థాయి అధికారులు తగిన సమాచారంతో హాజరుకావాలన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ పాల్గొనాలని కోరారు.

గణనాథునికి ప్రత్యేక పూజలు

ఆమదాలవలస పట్టణంలో గణపతి నవరాత్రులు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మోనింగివారి వీధిలో డీ సెవెన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.

\- ఆమదాలవలస



వైద్య సేవలపై ఆరా



కొత్తూరు: రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుంటున్న డీసీహెచ్‌ఎస్ కల్యాణబాబు

కొత్తూరు: ఆస్పత్రికి వస్తున్న రోగులకు సకాలంలో వైద్యం అందించాలని డీసీహెచ్‌ఎస్ కల్యాణబాబు వైద్యులకు సూచించారు. కొత్తూరు సీహెచ్‌సీని మంగళవారం పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అపారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అపారిశుధ్యాన్ని మెరుగుపరచాలని సూపరిటెండెంట్ ధర్మాన కిశోర్‌కు ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు

అప్రమత్తం..

మెళియాపుట్టి: సీజనల్ జ్వరాలు రాకుండా ప్రజలందరూ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మెళియాపుట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు అలేఖ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని పలువీధుల్లో తిరిగి ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పరిసరాలలో మురుగునీటి నిల్వలు, చెత్తాచెదారాలు ఉంటంతో దోమలు ప్రబలి రోగాలు వచ్చేఅవకాశాలు ఉన్నాయన్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. పలువురు వైద్యారోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.